# మనం
# మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

బుధవారం | 14 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com




# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి

సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి

పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి

రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి

- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పర్యాటక , సాంస్కృతిక శాఖ) వాణీ ప్రసాద్ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాదు నుంచి సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : అదనపు కలెక్టర్ నర్సింగరావు ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.... బతుకమ్మ వేడుకలు

- మిగతా 2లో..



## కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనకు

# గడ్కరీకి ఆహ్వానం

రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కలిసి వినతి అందించిన మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి ఊతమిచ్చేలా కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయి సుదీర్ఘంగా చర్చించారు.

– ఉమ్మడి మహబూబ్ నగర్/కొల్లాపూర్, అక్టోబర్ 14 (మనం బ్యూరో)

2

# నేడు డిప్యూటీ సీఎం రాక

డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి జూపల్లి పలు అభివృద్ధి పనులపై పర్యటన



నేడు నాగర్ కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనల కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అదేవిధంగా మంత్రి జూపల్లి హాజరుకానున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో) : ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు స్థానిక ప్రజలు, రైతులతో ముఖాముఖిగా సమావేశమవుతారు. ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. తదానంతరం అమ్రాబాద్ లో రహదారి నిర్మాణ

- మిగతా 2లో..

# కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనకు గడ్కరీకి ఆహ్వానం

ఉమ్మడి మహబూబ్ నగర్/కొల్లాపూర్, అక్టోబర్ 14 (మనం బ్యూరో) : జాతీయ రహదారి 167కేపై కృష్ణా నదిపై నిర్మించనున్న హైబ్రిడ్ కేబుల్-స్టేయిడ్, సస్పెన్షన్ తరహా ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరగా.. కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర అనుసంధానం మెరుగుపడటంతో పాటు హైదరాబాద్ నుంచి తిరుపతికి మధ్య 80 కి.మీ ప్రయాణ దూరం తగ్గి, సుమారు 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు.

**సోమశిల ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక శోభ**

ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఈ వంతెన నిర్మాణం దోహదపడుతుందన్నారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల.. ఆధ్యాత్మిక, పర్యాటక హబ్ గా వృద్ధి చెందని వివరించారు. తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని తెలిపారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్‌వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిల.. ప్రకృతి పర్యాటకానికి విశేష అవకాశాలున్న ప్రాంతంగా నిలుస్తుందని వివరించారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందన్నారు. బోటింగ్, పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు స్థానికంగా హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మెరుగైన రహదారి అనుసంధానం కీలకం కానుందని మంత్రులు వివరించారు.

**జాతీయ రహదారిగా మార్చండి**

రాష్ట్రంలో సుమారు 225 కి.మీ. మేర ప్రతిపాదించిన రహదారి మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని మంత్రులు కోరారు. పుల్లూరు (ఎన్‌హెచ్-44) నుంచి ఆలంపూర్- జటప్రోలు- పెంట్లవెల్లి - కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి (ఎన్‌హెచ్-765) - దేవరకొండ (ఎన్‌హెచ్-167) - మల్లేపల్లి మీదుగా నల్గొండ (ఎన్‌హెచ్-565) వరకు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అందుకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ రహదారి అభివృద్ధితో ఇప్పటికే ఉన్న జాతీయ రహదారులతో అనుసంధానం మెరుగుపడటంతోపాటు ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గుతాయని వారు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్య సేవలను సులభతరం కావడంతోపాటు పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని సంపూర్ణంగా వివరించారు.

**శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్**

హైదరాబాద్-శ్రీశైలం చీఎ-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి చేసిన విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డి పి ఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గడ్కరీని కలిసిన వారిలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర రోడ్డు రవాణా అదేవిధంగా రహదారుల శాఖ (వీశీ=ుఎ) అధికారులు, రాష్ట్ర అధికారులు ఉన్నారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలకే దక్కాలి

**అచ్చంపేట నియోజకవర్గం బిఆర్ఎస్ యువ నాయకుడు ఎనుపోతుల గణేష్ డిమాండ్**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : తెలంగాణ ప్రభుత్వం మొదటిసారిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది, అదే ధర్నాలో రెండో విడత ఇందిరమ్మ గృహాల ఎంపిక విషయంలో ఇల్లు లేని నిరుపేదలకే మొట్టమొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అచ్చంపేట బిఆర్ఎస్ యువ నాయకుడు ఎనుపోతుల గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని ఎంతోమంది నీరు పేదలు ఉన్నారని అన్నారు. అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పంతో ఉన్నప్పటికీ, అందుకు భిన్నంగా స్థానిక నాయకులు పార్టీ ఫీలింగ్ ఈగో అడ్డం పెట్టుకొని, ఇల్లు లేని నిరుపేదలకు క్షేత్రస్థాయిలో అన్యాయం చేస్తున్నారన్నారు. వెంకటేశ్వర్ల బావి గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందురమ్మ ఇండ్లు రెండో విడత 12 ఇండ్లు ఇచ్చారన్నారు. వెంకటేశ్వర్ల భావి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చి మన గ్రామ అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. మన గ్రామ ఇందిరమ్మ కమిటీ ద్వారా సర్పంచ్, డిప్యుటీ సర్పంచ్ వార్డు మెంబెర్స్ వాల నిర్ణయం ప్రకారం ఇవ్వాలన్నారు. ఏకపక్షంగ వ్యవహరించొద్దని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలి తప్ప తమ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేయదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# నేడు డిప్యూటీ సీఎం రాక

మొదటి పేజీ తరువాయి

పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, పదర మండలం జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని రాయలగండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుండి నేరుగా అచ్చంపేట ప్రాంతంలో పలు విద్యుత్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా 33/11 కేవీ ఐడీఎస్ సబ్‌స్టేషన్ షిఫ్టింగ్, సిద్ధాపూర్‌లో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం, బల్మూర్ మండలం రామాజిపల్లిలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం, వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి

గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి) : హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 43 నియోజకవర్గాల కు కోఆర్డినేటర్లను నియమించారు. వనపర్తితో పాటు జిల్లాలోని మక్తల్ కు మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూలుకు ఎమ్మెల్యే కుచుకుళ్ల రాజేష్ రెడ్డి తదితరులను నియమించారు. పట్టభద్రుల ఓటర్ల నమోదును పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేందుకు పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.

# మంగంపల్లిలో కుల వివక్ష

**ఎమ్మెల్యే స్వగ్రామంలో దళితులకు గుడిలోకి నో ఎంట్రీ**

**రాజ్యాంగ హక్కులకు భంగం**

**అడ్డుకున్న వారిపై ఎస్సీ/ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఫిర్యాదు**




వనపర్తి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి) : వనపర్తి ఎమ్మెల్యే సొంత గ్రామమైన పెద్దమందడి మండలం మంగంపల్లిలో దళితులకు ఆలయ ప్రవేశం నిరాకరించిన ఘటన కలకలం రేపింది. కోటి రూపాయల ప్రభుత్వ నిధులతో సోమవారం ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే దంపతులు భూమి పూజ చేశారు. అంతకు ఒక రోజు ముందు 20 మంది దళితులు వనపర్తిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి తమకు కూడా ఆలయ ప్రవేశం కల్పించాలని వినతిపత్రం ఇవ్వగా, గ్రామానికి వచ్చినప్పుడు తనతో పాటు పూజలోకి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. అయితే ఆహ్వానం రాకపోవడంతో మాసాని సు-ధీర్ అనే దళితుడు తన భార్య, కూతురితో కలిసి హక్కుగా భావించి స్వయంగా గుడికి వెళ్లి దర్శనం చేసుకుని వస్తుండగా ఎమ్మెల్యే మేనమామ కుప్పిరెడ్డి వెంకట్రామా రెడ్డి, ఎద్దుల శ్రీనివాస్ రెడ్డి అడ్డుకుని "మాదిగలకు గుడిలోకి ప్రవేశం లేదు, ఎందుకు వచ్చావు" అంటూ కులం పేరుతో దుర్భాషలాడి మూకుమ్మడి దాడికి యత్నించారని ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో పక్కనే పూజలో ఉన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చూస్తూ కూడా తన వర్గాన్ని వారించకుండా మౌనం వహించడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై మంగళవారం బాధితుడు మాసాని సుధీర్, గంధం పరంజ్యోతి, సిరిగిరి మన్నెం, పానుగంటి సురేష్, మంద రాము తదితర దళిత నేతలతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. వెంకట్రామా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకోవడంతో పాటు ఆలయ ప్రవేశం కల్పించాలని, లేకుంటే ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.



# ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసన సరి కాదు

**ఉపాధ్యాయులపై వెంటనే చర్యలు తీసుకోవాలి**

**డీఈవోకు బీజేపీ నేతల వినతి**



వనపర్తి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి): రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా శనివారం వనపర్తి రాజీవ్ చౌరస్తాలో నిరసనకు దిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, నేతలు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు రాజ్యాంగ విలువలు బోధించాల్సిన ఉపాధ్యాయులే రాజ్యాంగ సంస్థకు వ్యతిరేకంగా రోడ్డెక్కడం సరికాదన్నారు. సర్వీస్ నిబంధనలను ఉల్లంఘించిన ఉపాధ్యాయులను విచారించి సస్పెండ్ చేయాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్, వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్ పాల్గొన్నారు.





# వనపర్తి మునిసిపాలిటీలో 'డ్రైడే'ట్యూస్డే'ఫ్రైడే'!

వనపర్తి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి) : వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం 'డ్రైడే ట్యూస్డే - ఫ్రైడే' కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో పారిశుధ్య సిబ్బందితో పిచ్చి మొక్కలు తొలగించడం, మురికి కాలువలు, రోడ్ల శుభ్రత చేపట్టారు. మురికి నీటి నిల్వ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, శానిటరీ ఇన్ స్పెక్టర్ ఉమామహేశ్వర రెడ్డి, పీహెచ్చీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# గ్యాస్ సిలిండర్ పేలి ఒకే కుటుంబంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**క్షతగాత్రులను హైదరాబాద్ కు తరలింపు**

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

వనపర్తి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి) : వంట చేసుకుందామని వెలిగించిన సిలిండర్ కాస్తా పేలి.. క్షణాల్లోనే కుటుంబాన్ని చిన్నా భిన్నం చేసింది. వనపర్తి మున్సిపాలిటీ 30వ వార్డులో వెంకటాచారి ఇంట్లో మంగళవారం భారత్ గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలి భారీ మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంట్లోని ఫర్నిచర్, సామాన్లు పూర్తిగా కాలిపోయాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పేద కుటుంబం ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో ఉన్నారు. భారత్ గ్యాస్ కంపెనీ బాధ్యత వహించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలి. లేకుంటే కంపెనీ ఎదుట ఆందోళన చేపడతామని వాకిటి శ్రీధర్ హెచ్చరించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## దళితుల ఆలయ ప్రవేశంపై దుష్ప్రచారం అవాస్తవం

### సర్పంచ్ రమేష్ నాయక్





పెద్దమందడి అక్టోబర్ 14 (మనం ప్రతినిధి) : పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళితులను ఆలయంలోకి రానివ్వడం లేదంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని సర్పంచ్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలోకి దళితులను అడ్డుకున్నారంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామానికి చెందిన సుధీర్ అనే దళితుడు సోమవారం ఉదయం సతీసమేతంగా ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఫొటోలే అందుకు నిదర్శనమని సర్పంచ్ తెలిపారు. వ్యక్తిగతంగా మాట్లాడుకున్న అంశాలను భూతద్దంలో చూపుతూ దళితుల ఆలయ ప్రవేశానికి ముడిపెట్టి కొందరు గ్రామంలో స్నేహపూర్వక వాతావరణాన్ని కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. దళితులను అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలు చేయొద్దని కోరారు.



## అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గామాత

చారకొండ, అక్టోబర్13(మనం న్యూస్) : మండల పరిధిలోని శేరీ అప్పారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రుల్లో భాగంగా మూడవరోజు మంగళవారం అన్నపూర్ణ దేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాత. దుర్గామాత కు ప్రత్యేక పూజలు చల్ల శోభా రాంరెడ్డి,చల్ల రామ ప్రభాకర్ రెడ్డి ఇరువురు దంపతులు వారి కుటుంబ సభ్యులతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. పిల్లాపాపలను,కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని అదేవిధంగా గ్రామ ప్రజలను చల్లగా చూసి సుఖశాంతులు కలగజేయాలని మనస్ఫూర్తిగా అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## మాగనూర్ మండల ప్రెస్ క్లబ్ ఎన్నిక ఏకగ్రీవం

మాగనూర్ 13(మనం న్యూస్) : మక్తల్ నియోజకవర్గం లోని మాగనూర్ మండల ప్రెస్ క్లబ్ కమిటీని సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పి. సురేష్, ఉపాధ్యక్షులుగా జి. నరేష్ మరియు కె. శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా బి. కథలప్ప, కోశాధికారిగా బి. శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్య ల సాధనకై కృషి చేస్తానన్నారు. జర్నలిస్ట్ ల న్యాయపరమైన డిమాండ్ లను ప్రభుత్వం దృష్టికీ తీసుకెళ్తానని తెలిపారు.



## మాదిగలు ఆర్థిక సామాజిక రాజకీయ రంగంలో ఎదగాలి

### మండల ఇంచార్జ్ రాజమౌళి మాదిగ

**ఎర్రవల్లి,జేపల్లి మాదిగలతో సన్నాహక సమావేశం**



చారకొండ,అక్టోబర్13(మనం న్యూస్) : మాదిగలు ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలలో ఎదగాలని చారకొండ మండల ఎమ్మార్పీఎస్/ఎంఎస్పి ఇన్చార్జి చెల్లపాటి రాజమౌళి మాదిగ అన్నారు. సామాజిక పరివర్తకులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, నాగర్ కర్నూల్ జిల్లా ఎంఆర్పిఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ అనుబంధ సంఘాల ఇన్చార్జిలు ఆడెపు నాగా ర్జున మాదిగ,మద్దిలేటి మాదిగల సూచనతో మాదిగల చైతన్యం కోసం గ్రామ కమిటీ, మండల కమిటల నిర్మాణం కోసం మంగళవారం చారకొండ మండల పరిధి జేపల్లి,ఎర్రవల్లి గ్రామాల మాదిగ యువకులకులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో మండల ఇన్చార్జ్ చెల్లెపాటి రాజమౌళి మాదిగ మాట్లాడుతూ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు,మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ రిజర్వేషన్లు సాధించుకున్నామని ఆపోరాటంలో ఎంతో మంది మాదిగలు తమప్రాణాలను కోల్పోయారని,మాన్యశ్రీ మందకృష్ణ మాది గ ఆశయ సాధన కోసం అమరవీరుల త్యాగ ఫలితంగా సాధించుకున్న తొమ్మిది శాతం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను పొందా లంటే కష్టపడి పిల్లలను బాగా చదివిం చాలని, ఒకరి కొకరు సహకరించుకొని కష్టనష్టాల్లో పాలుపంచుకొని చదువుల్లో కొనసాగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా రాజ్యాధికా రం లేని జాతులు అంతరించి పోతాయన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచన మేరకు భవిష్యత్తులో మహ జననేత పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ తీసుకోబోయే ఏనిర్ణయానికైన రాజ్యాధికారంలో భాగస్వామ్యం కోసం జరిగే పోరాటంలో చేయి చేయి కలుపుతూ అడుగులో అడుగేసి ముందుకు సాగాలని ఊరికి చివరకు నెట్టబడి అస్పృశ్యతకు అవమానాలకు గురైన మనం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పరిపాలకులుగా ఎదిగి అభివృద్ధిలోకి రావాలని అన్నిరంగాల్లో ఆర్థిక సామాజిక రాజకీయరంగాల్లో ముందుం డాలని అందుకు ఆర్థిక సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు అశోక్ రాథోడ్ (జేపల్లి గ్రామ సర్పంచి భర్త)వంకేశ్వరం నిరంజన్, వంకేశ్వరం లక్ష్మయ్య,వంకేశ్వరం ఎల్లయ్య, వంకేశ్వరం మధు,మాడుగుల ప్రశాంత్, వెంకటయ్య, సూగూరి అఖిల్,సూగూరి వినయ్,సుగురి దీప్తి,మేఘన,వెంకటయ్య బాలరాం,సూరి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## అక్టోబర్ 17న,కల్వకుర్తిలో మహా ధర్నా

### ఎర్రవల్లి భూనిర్వాసితులతో సన్నాహక సమావేశం



చారకొండ,అక్టోబర్13(మనం న్యూస్) : చారకొండ మండలం ఎర్రవల్లి భూ నిర్వాసితులతో మంగళవారం డిండి ఎత్తిపోతల రద్దు చేయాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో సన్నాక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈనెల 17న కల్వకుర్తిలో జరిగే సన్నాహక సమావేశానికి భూనిర్వాసితులు అందరూ పాల్గొనాలని జేఏసీ నాయకులు తెలిపారు. ఎర్రవల్లి భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 316వ,రోజుకు చేరింది. జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సభ్యులు రాఘవాచారి,చెన్న కృష్ణ, తిమ్మప్ప కల్వకుర్తి జేఏసీ నాయకులు డా,సదానందం గౌడ్,జేఏసీ నాయకులు కానుగుల జంగయ్య,ఏకుల ప్రకాష్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రద్దీ

### ఫార్మసిస్ట్ గైర్హాజరుతో రోగుల ఇబ్బందులు

మిడ్జిల్, అక్టోబర్ 13 (మనం న్యూస్): మిడ్జిల్ మండల కేంద్రంలో మహబూబ్ నగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఐవీనా) తనిఖీల నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రులు మూతపడడంతో, మండల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీ అధికంగా కనిపించింది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు ఫార్మసిస్ట్ గైర్హాజరు కావడంతో మందుల కోసం ఇబ్బందులు పడ్డామని వాపోయారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని, కానీ కొన్ని సమయాల్లో ఒక్క డాక్టర్ కూడా విధుల్లో ఉండటం లేదని, అక్కడ పనిచేసే సిబ్బంది ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించడం లేదనే ఫిర్యాదులు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రకాలుగా సరిచేసి, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు ఎందుకు వెళతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేయడమే కాకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయో కూడా పరిశీలించి, రోగులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# మంగంపల్లి ఆలయ వివాదంపై సమగ్ర విచారణ జరపాలి

**దళితులకు న్యాయం చేయాలి**

**కలెక్టర్, ఎస్పీ తక్షణమే స్పందించాలి: పూర్ణ కంటి కిరణ్**



రేవల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఆలయ దర్శనానికి వెళ్లిన దళిత కుటుంబాన్ని అవమానించారనే ఆరోపణలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలని పూర్ణ కంటి కిరణ్ డిమాండ్ చేశారు. కులం పేరుతో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కులవివక్ష అనేది ఒక వ్యక్తికి జరిగిన అవమానానికే పరిమితం కాకుండా, సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, మానవ హక్కులకు సంబంధించిన తీవ్రమైన సమస్య అని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ప్రజా ప్రదేశాలు, ప్రార్థనా స్థలాల్లో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం లభించాల్సిన అవసరం ఉందన్నారు. కాలం మారుతున్నా కులం ఆధారంగా వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు రావడం సామాజికంగా ఆందోళనకరమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వపు హక్కును కల్పించిందని, అంటరానితనాన్ని నిషేధించిందని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని 14, 15, 17వ అధికరణాల స్ఫూర్తికి అనుగుణంగా కులవివక్షకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ లేదా ప్రభుత్వ భూమిలో ఆలయం నిర్మించినట్లు ఉంటే, దాని స్థితిగతులు, నిర్వహణ, ప్రజల ప్రవేశానికి సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి వాస్తవాలను నిర్ధారించాలని, ఫిర్యాదు మరియు విచారణలో వెల్లడయ్యే ఆధారాల ప్రకారం బాధ్యులపై వర్తించే చట్టాల కింద చర్యలు తీసుకోవాలని పూర్ణ కంటి కిరణ్ డిమాండ్ చేశారు. కులవివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# జనగణనతోనే అభివృద్ధి ప్రణాళికలకు పునాది

**డిజిటల్ విధానంలో జనాభా వివరాల సేకరణ**

**చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు ప్రారంభం**

**నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లా ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు జనగణన కీలకమని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అన్నారు. జనగణన-2027 నిర్వహణలో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దేవ సహాయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనగణనలో సేకరించే వివరాలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు దోహదపడతాయన్నారు. ఈసారి డిజిటల్ విధానంలో మొబైల్ ఫోన్ల ద్వారా జనాభా వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల సంఖ్య, వయస్సు, వృత్తి తదితర వివరాలను నిర్దేశిత ప్రశ్నావళి ప్రకారం సేకరిస్తారని వివరించారు. జనాభా గణాంకాల ఆధారంగా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడంతోపాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల అవసరాలను గుర్తించవచ్చున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాచార సేకరణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలను సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. జనగణన విధివిధానాలు, డిజిటల్ నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయి-లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండు రోజుల శిక్షణలో సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనగణన అధికారులు శివరామకృష్ణ, కె. రిషిత్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని డి. సుజాత, అదనపు జనగణన అధికారి నరసింహస్వామి, చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.





## తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ పెరడేషన్ కమిటీ ఏర్పాటు

మిడ్జిల్ అక్టోబర్ 13 (మనం న్యూస్) : మండల కేంద్రంలో ఎం పీ డీవో మరియు ఎంపీఓ సమక్షంలో (టిపిఎస్ఎఫ్) మిడ్జిల్ మండల కార్యవర్గ సభ్యుల ఎన్నికల కార్యక్రమంలో భాగంగా మిడ్జిల్ మండల అధ్యక్షుడిగా P వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా D మధు కుమార్, ఖజానాధికారిగా BJ ప్రీతి ,ఉపాధ్యక్షులుగా G రామస్వామి, గౌరవ అధ్యక్షులుగా చీరాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ వీణ మతిన్, పత్రికా విభాగం కోఆర్డినేటర్ గా K వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్ గా CH. ఆంజనేయులు గార్లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# లైబ్రరీ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు

**ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ కృతజ్ఞతలు**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పెండింగ్ బిల్లుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయ సంస్థల చైర్మన్ల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటిని మంజూరు చేయడం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశమని గంగాపురం రాజేందర్ పేర్కొన్నారు. ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు, వారి ఆర్థిక ఇబ్బందులు తగ్గించేందుకు ఇలాంటి నిర్ణయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల మంజూరుకు సహకరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయ సంస్థల చైర్మన్ల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రంథాలయాలు ప్రజల్లో విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. పెండింగ్ బిల్లుల మంజూరుతో ఉద్యోగులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సానుకూలత పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ గ్రంథాలయాల అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. గ్రంథాలయ ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రి జూపల్లి కృష్ణారావుకు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ పేర్కొన్నారు.



# వెట్టిచాకిరీ నిర్మూలనపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి

**జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : వెట్టిచాకిరీ నిర్మూలనపై జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా కళాకారులు తమ ప్రదర్శనలతో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావులు అన్నారు. మంగళవారం ఐడీఓసీ ఆవరణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు ఇతర అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వెట్టి చాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు, అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించడంతో పాటు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 08069434343 ను ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో వెట్టి చాకిరీని పూర్తిగా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులను గుర్తించడం, వారిని రక్షించడం, అవసరమైన సహాయం మరియు పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేదా శ్రమ దోపిడీ ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాధితులను గుర్తించి, విముక్తి కల్పించి, పునరావాసం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని తెలిపారు. హెల్ప్ లైన్ ఫోన్ నంబరు కు సమాచారం అందించడం ద్వారా వెట్టి చాకిరీ ఘటనలను అధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్, డిడబ్ల్యూఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, కళాకారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కరెంటు కోతలతో రైతులు విలవిల

**పంటలు ఎండిపోతున్నాయ్!.. విద్యుత్ ఆఫీసుకు తాళం... తలుపుకే వినతిపత్రం!**

నాగర్ కర్నూల్( మనం న్యూస్ అక్టోబర్ 13) : నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలో విద్యుత్ కోతలతో రైతులు విలవిలలాడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని... దీంతో రైతులు కష్టపడి వేసిన పంటలు కళ్ళ ముందే ఎండిపోతున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు చెప్పుకుందామని మంగళవారం బిజినపల్లి విద్యుత్ కార్యాలయానికి వెళ్లిన సిపిఎం నాయకులకు తీవ్ర నిరాశ ఎదురైంది. కార్యాలయానికి తాళం వేసి ఉండటం... లోపల ఒక్క అధికారి కూడా లేకపోవడంతో... చేసేదేమీ లేక ఆఫీసు తలుపులకే వినతిపత్రం అంటించి తమ నిరసనను తెలియజేశారు. "ఆఫీసులో అధికారులు ఉంటేనే కరెంటు ఉండదు. ఇక ఆఫీసుకే తాళం వేస్తే రైతుల పరిస్థితి ఏంటి?" అని గుంపల్లి అశోక్ ప్రశ్నించారు. వరి, వేరుశనగ, మినుము పంటలు వేసి... నీరు లేక ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారని... కరెంటుపై ఆధారపడిన లాండ్రీ, ఎలక్ట్రికల్, వెల్డింగ్ షాపులు మూసివేసుకుని చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ ఇవ్వాలని... లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు కె. మల్లేష్, డి. మల్లేష్, జంపులేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# రీలొకేషన్ వద్దు.. మా గ్రామమే ముద్దు!

**గ్రామ అభివృద్ధిని అడ్డుకోవద్దు.. వటువర్లపల్లి గ్రామస్తుల ఆందోళన**

**హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన**

**అటవీశాఖ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): రీలొకేషన్ వద్దు.. మా గ్రామమే ముద్దు.. మేము ఇక్కడే పుట్టాం.. ఇక్కడే పెరిగాం.. ఇక్కడే జీవిస్తాం.. మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.. అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామస్తులు తమ నిరసన గళాన్ని వినిపించారు. గ్రామ అభివృద్ధికి అటవీశాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ హైదరాబాద్--శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా రీలొకేషన్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామ అభివృద్ధి పనులకు అడ్డంకులంటూ ఆరోపణలు**

వటువర్లపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అటవీశాఖ అధికారుల నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయని గ్రామ-స్తులు ఆరోపించారు. గ్రామంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన ఇసుక, కంకర తీసుకువస్తున్నా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేద కుటుంబాలు సొంతంగా ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, పనులు ముందుకు సాగకుండా అడ్డంకులు ఎదు-రవుతున్నాయని పేర్కొన్నారు.

**మధ్యలోనే నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం**

గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభమైనప్పటికీ, నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి అవసరమైన వాటర్ ట్యాంకు, ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తికావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, కాంట్రాక్టర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కారణంగా గ్రామంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రీలొకేషన్ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన**

రీలొకేషన్ పేరుతో గ్రామంలోని కొంతమంది ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రలోభాలకు గురిచేసి గ్రామం నుంచి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. తరతరాలుగా నివసిస్తున్న తమ గ్రామాన్ని విడిచి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ పూర్వీకుల నుంచి నివసిస్తున్న ప్రాంతంతో తమకు విడదీ-యలేని అనుబంధం ఉందని, ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే జీవిస్తున్నామని తెలిపారు. గ్రామాన్ని ఖాళీ చేయించడం కంటే, గ్రామంలోనే అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి**

రీలొకేషన్ పేరుతో తమను ఇబ్బందులకు గురిచేయకుండా, గ్రామంలో పాఠశాల భవనం, తాగునీటి సదుపాయాలు, ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ గోడ వంటి పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తీసుకువచ్చేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ నిధులతో మంజూరైన పనులను పూర్తి చేసి, తమ గ్రామానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నిరసనలో పాల్గొన్న గ్రామస్తులు**

ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఛత్రు నాయక్, సర్య నాయక్, వార్డు సభ్యులు చిట్టెమ్మ, మౌనిక, వెంకటపతి, మాజీ వార్డు సభ్యులు సాలమ్మ, భరత్, రమేష్, గ్రామ పెద్దలు ఇమ్మడి కిష్టయ్య, కాశయ్య, భవాని, సత్తి, అంజయ్య, కృష్ణా నాయక్, రత్యా నాయక్, మహిళా సంఘాల నాయకులు జ్యోతి, అనసూయ, ఈదమ్మ, చిట్టెమ్మతో పాటు గ్రామ యువకులు ప్రభాకర్, ఇమ్మడి అనిల్, మంతటి అంజి, అఖిల్, శివకుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి జరిగే వరకు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా గ్రామస్తులు స్పష్టం చేశారు.

# ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

**అర్హులైన ఎస్సీ, ఎస్టీ డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి**

**నేడు సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ**

**నాగర్ కర్నూల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమపతి**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న యువతీ, యువకులు పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. ఉమాపతి మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన డిగ్రీ ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్ 20వ. తేదీ వరకు ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన అభ్యర్థులు 2026 అక్టోబర్ 14వ. తేదీ సాయంత్రం 5 గంటలలోపు మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని ఉమాపతి సూచించారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి ఆఫ్‌లైన్ విధానంలో అందజేయాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఉంటుందని స్పష్టం చేశారు. పోలీస్ ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8977340006, 8500334470, 8309657774 ఫోన్ నంబర్లను సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. ఉమాపతి సూచించారు.

# లక్ష్మీ చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన ఏర్పాట్ల పరిశీలన**

**రాయలగండిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అచ్చంపేట ఎమ్మెల్యే**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని రాయలగండిలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారిని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

**అభివృద్ధి పనుల ఏర్పాట్లపై సమీక్ష**

రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పర్యటనలో భాగంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తూ, కార్యక్రమం విజయవంతం అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

**ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం**

ప్రాంత అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనతో ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్. కృష్ణవేణి సాయిబాబు, మాజీ జెడ్పీటీసీ రాంబాబు, పదర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ పదర మండల మాజీ అధ్యక్షుడు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# వేరుశనగ సాగులో ఆధునిక సాంకేతికత

**రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన**

**ఐసీఏఆర్-ఐఐఓఆర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి ప్రదర్శన**

**ర్యాపిడ్ సాయిల్ టెస్టింగ్ కిట్‌తో భూసార పరీక్షల విధానం వివరణ**

కల్వకుర్తి రూరల్,అక్టోబర్ 13 (మనం న్యూస్) : రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పరిచయం చేస్తూ, పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించే లక్ష్యంతో మంగళవారం కల్వకుర్తి మండలం గుండూరు గ్రామంలో వేరుశనగ విత్తనాలకు బయోపాలిమర్ పూత వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన పూత సాంకేతికతతో పాటు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) పరిధిలోని హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఉన్న భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.డి. ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని వేరుశనగ విత్తనాలకు బయోపాలిమర్ పూత వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సాంకేతికతను ఉపయోగించే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. విత్తనాల నాణ్యత, పంట ప్రారంభ దశలో మొక్కల ఎదుగుదల, మెరుగైన పంట యాజమాన్యంలో విత్తన శుద్ధి ప్రాముఖ్యతను తెలియజేశారు.

**భూసార పరీక్షలతో ఎరువుల వినియోగంలో సమతుల్యత**

సేవా స్ఫూర్తి ఫౌండేషన్, హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ జి. వారు నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ఆవశ్యకతను వివరించారు. సాగుకు ముందే భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా నేలలో ఉన్న పోషకాల స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను సమతుల్యంగా వినియోగిస్తే సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని దీర్ఘకాలం కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.అనంతరం ర్యాపిడ్ సాయిల్ టెస్టింగ్ కిట్ సహాయంతో భూసార పరీక్షలు నిర్వహించే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కిట్ ద్వారా రైతులు తమ పొలాల్లోని నేల పరిస్థితులను తెలుసుకొని, పంటలకు అవసరమైన పోషకాల యాజమాన్యంపై తగిన నిర్ణయాలు తీసుకోవచ్చని వివరించారు.

**ఆధునిక పద్ధతులతో స్థిరమైన వ్యవసాయం**

రైతులు బయోపాలిమర్ విత్తన పూత సాంకేతికత, భూసార పరీక్షల విధానాలపై ఆసక్తి కనబరిచి పలు అంశాలను తెలుసుకున్నారు.ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను అందిపుచ్చుకోవడంతో పాటు నేల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సాగు ఖర్చులను సమర్థంగా నిర్వహించుకుంటూ స్థిరమైన వ్యవసాయం దిశగా ముందుకు సాగవచ్చని కార్యక్రమంలో వివరించారు.పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను క్షేత్రస్థాయిలో రైతులకు పరిచయం చేయడం ద్వారా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఊరు ఆరిజిన్స్ వ్యవస్థాపకులు విజయ్, అజయ్ ,ప్రగతిశీల రైతులు వెంకటయ్య, బీరప్ప, జంగమయ్య, మల్లేష్, వీరాస్వామి, సాంబశివుడు, భగవంత్, సాయిబాబు, పరమేష్, శేఖర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# అక్కారం పంచాయతీ రికార్డులు స్వాధీనం

**అభివృద్ధి పనుల్లో రూ.15 లక్షల అవినీతి జరిగిందని ఫిర్యాదు**

**విచారణ కోసం రికార్డులు తీసుకున్న డివిజన్ పంచాయతీ అధికారి**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం అక్కారం గ్రామపంచాయతీ రికార్డులను డివిజన్ పంచాయతీ అధికారి వెంకటప్రసాద్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల పేరుతో సుమారు రూ.15 లక్షల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్థులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టే క్రమంలో అధికారి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**రూ.15 లక్షల నిధుల వినియోగంపై ఆరోపణలు**

అక్కారం గ్రామపంచాయతీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల ఖర్చులో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు.

**విచారణ కోసం రికార్డుల స్వాధీనం**

గ్రామస్థుల ఫిర్యాదు నేపథ్యంలో డివిజన్ పంచాయతీ అధికారి వెంకటప్రసాద్ అక్కారం గ్రామపంచాయతీకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. సర్పంచి సమక్షంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి వెచ్చించిన నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం సంబంధిత పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు, నిధుల ఖర్చుల వివరాలను పరిశీలించిన అనంతరం ఆరోపణల్లో వాస్తవాలు ఎంతవరకు ఉన్నాయో తేలనుంది. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది. అయితే, రూ.15 లక్షల అవినీతి ఆరోపణలు ఇంకా విచారణలో తేలాల్సి ఉంది.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభం

నాగర్ కర్నూల్, అక్టోబర్ 13 (మనం న్యూస్) : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఎన్ హెచ్ ఎం జెఏసి తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కోవిడ్ వంటి క్లిష్ట సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడిన తమకు... నేడు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. 78 కేడర్లకు చెందిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఏసి



నాయకులు మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు... వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సమ్మె కొనసాగుతుందని తెలిపారు.

**బతుకమ్మ ఆడుతూ నిరసన**

తమ నిరసనను తెలియజేసేందుకు రేపు అక్టోబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ ఆడుతూ వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం దిగి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని ఐక్యంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.డి. గౌస్ పాషా, జిల్లా జెఏసి అధ్యక్షులు డాక్టర్ బాలకృష్ణ, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## భక్త మార్కండేయ ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**మూడవరోజు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనం**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. పద్మశాలి మహిళ సంఘం ఆధ్వర్యంలో గణపతికి, శివునికి, అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదానంతరం హోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివునికి పంచామృతలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి అన్నంతో పూర్ణ కుంభాభిషేకం చేయడం జరిగింది. మహిళ సంఘం అధ్యక్షురాలు పులిజాల కల్యాణి ఆధ్వర్యంలో సరస్వతి దేవాలయంలో మహిళలంత కుంకుమార్చన చేశారు. బతుకమ్మ ఆటపాటలు ఆడుతూ కోలాటాలు ఆడారు. స్వామివారి చెంతకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో శివాలయ అధ్యక్షుడు దాసు నాగరాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, చిలువేరు ధనరాజ్, కర్నాటి రాములు, మహిళ సంఘం అధ్యక్షురాలు పులిజాల కల్యాణి, చిలువేరు శ్రావణి, కోట ప్రశాంతితో పాటు కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యుత్ కార్యాలయ శంకుస్థాపన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాలు**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): అచ్చంపేట పట్టణంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ శాఖ కార్యాలయ భవన శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం రాత్రి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

**ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు**

ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

**అచ్చంపేట అభివృద్ధికి మరో ముందడుగు**

అచ్చంపేట పట్టణంలో నూతన విద్యుత్ శాఖ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టడం ద్వారా విద్యుత్ శాఖకు సంబంధించిన పరిపాలనా కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలగనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## జాతి అభివృద్ధే లక్ష్యంగా ఎంఈఎఫ్

**జిల్లా కన్వీనర్ గా కాళ్ల ప్రసాద్ ను ప్రకటించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్**





నాగర్ కర్నూల్( మనం న్యూస్, అక్టోబర్ 13:) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరపాగ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అదనపు కార్యదర్శి గాలి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ గా కాళ్ల ప్రసాద్ మాదిగను, జిల్లా కో కన్వీనర్ గా మిద్దె సైదులు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాలుగు డివిజన్లకు కో కన్వీనర్లుగా నాగర్ కర్నూల్ కు మిద్దె సైదులు, అచ్చంపేటకు సుదపాక వెంకటయ్య, కల్వకుర్తికి ఇంజమూరి భాస్కర్, కొల్లాపూర్ కు ఎల్లపోగు లక్ష్మయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆది సురేందర్, కారంగి నరసింహులు, మిద్దె పరుశురామ్, బాల లక్ష్మణ్, నాగభూషణం, తిరుపతయ్య, పాండు, ఎల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు జాబ్ మేళా కార్యక్రమం

**జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రశాంతి వెల్లడి**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పన అధికారి జి. ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ఫ్‌-30/1 , జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న. ఉదయం 11;00 గం. నుండి మధ్యాహ్నం 2;00 గం. వరకు జాబ్ మేళా నిర్వహించబడునని తెలిపారు. అలాగే జాబ్ మేళాలో పాల్గొనే కంపెనీలు, అర్హతల వివరాలు:

1. మెడ్‌ప్లస్: బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీసీఐ అర్హతలు. 2. అపోలో ఫార్మసీ: ఎస్ఎస్‌సీ నుంచి ఏదైనా డిగ్రీ. 3. పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్: ఎస్ఎస్‌సీ నుంచి ఏదైనా డిగ్రీ. 4. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్: ఎస్ఎస్‌సీ నుంచి ఏదైనా డిగ్రీ. 5. ఎల్ఎన్ గ్రూప్: ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ. అసెంబ్లీ ఆపరేటర్ పోస్టుకు నెల జీతం రూ. 20,733.

వయస్సు: 18 నుంచి 35 సంవత్సరాలు, ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ అనంతరం గద్వాల, ఐజ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, బెంగళూరులోని కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రశాంతి కోరారు.

## ఉమామహేశ్వర క్షేత్రంలో కన్నుల పండుగగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**మూడో రోజు అన్నపూర్ణాదేవిగా దర్శనం**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భం గా ఉమామహేశ్వర క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. మంగళవారం మూడవరోజు నా అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవస్థాన పాలక మండలి



సభ్యురాలు శంభు శోభ, వెంకటరమణులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి!

**లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపడతాం**

**తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. అశోక్ హెచ్చరిక**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. అశోక్ డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. మంగళవారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల చిరకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

**పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి**

అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్హులైన గిరిజనులకు పోడు భూములపై హక్కు పత్రాలు అందించాలని అశోక్ డిమాండ్ చేశారు. భూములపై హక్కులు లేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు చట్టప్రకారం భూ హక్కులు కల్పించి, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా గిరిజన తండాలకు రెవెన్యూ హోదా కల్పించడంతో పాటు, తండాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రతి తండా, గూడెం పంచాయతీకి రూ.25 లక్షలు కేటాయించాలి**

రాష్ట్రంలోని ప్రతి గిరిజన తండా, గూడెం గ్రామపంచాయతీకి ఏటా రూ.25 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని అశోక్ కోరారు. తండాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదు-పాయాలను మెరుగుపరచాలని సూచించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, నిధుల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**గిరిజన కార్పొరేషన్లకు రూ.500 కోట్ల చొప్పున నిధులు ఇవ్వాలి**

గిరిజనుల ఆర్థిక అభివృద్ధి కోసం గిరిజన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి, ఒక్కో కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈ నిధులతో గిరిజన య-ువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు రుణాలు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ పథకాలను సమ-ర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.. లంబాడీ భాషకు గుర్తింపు కల్పించాలి**

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని అశోక్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. అదేవిధంగా లంబాడీ భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. గిరిజన భాషలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**గిరిజన వలసలను అరికట్టి స్థానికంగా ఉపాధి కల్పించాలి**

నాగర్‌కర్నూల్ జిల్లాలో గిరిజన కుటుంబాలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులను నివారించాలని అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు, యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి మార్గాలను ప్రోత్సహించాలని అన్నారు. వ్యవసాయం, పశుపోషణ, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించి, వలసల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు**

గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని అశోక్ స్పష్టం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో ఎల్. దేశ్య నాయక్, రామావత్ లక్ష్మణ్ నాయక్, వి. శ్రీనివాస్ నాయక్, ఎస్. లక్పతి నాయక్, శంకర్ నాయక్, దశరథం నాయక్, కేతావత్ గోపాల్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. గిరిజనుల హక్కుల సాధన, సంక్షేమం, తండాల అభివృద్ధి కోసం సంఘటితంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

# కామ్రేడ్ గుండా మల్లేష్ ఘనంగా వర్ధంతి వేడుకలు



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 13 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మంగళవారం కామ్రేడ్ గుండా మల్లేష్ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు చిత్రపటానికి ముందుగా పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. జోహార్లు కామ్రేడ్ గుండా మల్లేష్ వర్ధంతి సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి సభ్యుడు వంకేశ్వరం శ్రీనివాసులు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్ లో ఘనంగా డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ గుండా మల్లేష్ బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. శాసనసభలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ, అణగారిన వర్గాల హక్కుల కోసం తన గళాన్ని వినిపించారని ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యంగా దళితుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసిన ఆయన, దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులుగా దళిత ఉద్యమానికి విశేష సేవలందించారని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలు, కమ్యూనిస్టు భావజాలం ప్రజా ఉద్యమాల ద్వారా ముందుకు సాగాలనే ఆకాంక్షతో పనిచేశారన్నారు.

కామ్రేడ్ గుండా మల్లేష్ ప్రజా పోరాట జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నరు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ దళితుల హక్కుల సాధనకు, కుల వివక్ష నిర్మూలనకు, సామాజిక సమానత్వ స్థాపనకు కృషి చేయడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాలని తెలిపారు. జోహార్లు కామ్రేడ్ గుండా మల్లేష్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మీ ఆశయాల సాధనకు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కొత్త రామస్వామి, డిహెచ్‌పిఎస్ నాయకులు కల్మూరి విష్ణు, ఈర్ల భూపేష్, కొర్రా శేఖర్,బాల పిరు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ఉద్యోగులుగా గుర్తించాలి

**జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు నిరాసన, ధర్నా**

**సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి : టిజెఎసి చైర్మన్ డా. రాజీవ్ రెడ్డి**

మహబూబ్ నగర్, 13అక్టోబర్, (మనం న్యూస్) : జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యం లో నిరవధిక నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ టీటీడీ కళ్యాణ మండపం వద్దఎన్ ఎచ్ ఎం ఉద్యోగులు ధర్నాకు టి ఎన్ జీఓస్ సంపూర్ణ మద్దత్తు తెలిపారు . ఈ ధర్నా కార్యక్రమానికి టీజీజేఏసీ చైర్మన్ మరియు టీఎన్ జీ ఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజీవ్ రెడ్డి లతో పాటు జిల్లా కార్యదర్శి చంద్రా నాయక్, కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు సుభాష్ చంద్ర బాస్ , పట్టణ కమిటీ కోశాధికారి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ డా. రాజీవ్ రెడ్డి ప్రసంగిస్తూ ఎన్ ఎచ్ ఎం ఉద్యోగుల పోరాటం న్యాయ పోరాటం అని సమాన పనికి సమాన వేతనం కోరడం అది వారి హక్కు అని తెలిపారు. మిమ్ములను రాష్ట్ర ఉద్యోగులుగా గుర్తించే వరకు మీ పోరాటం కొనసాగించాలని డిమాండ్ చేయడం జరిగినది. తదుపరి ఎన్ ఎచ్ ఎం జేఏసీ ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం జిల్లా చైర్మన్ కి సమర్పించినారు. ఈ ధర్నా కార్యక్రమము ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి ఎన్ ఎచ్ ఎం జేఏసీ నాయకులు సునీల్ , రఘు. ప్రవీణ్ నాయకులు పెద్ద ఎత్తున్న ఎన్ ఎచ్ఎం జేఏసీ ఉద్యోగులు పాల్గొన్నారు

# రైతులకు ప్రత్యామ్నాయం చూపాలి

## ఎల్ నినో సాకుగా చూపొద్దు

### మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్, 13అక్టోబర్, (మనం న్యూస్) : రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే, ప్రభుత్వం ఎల్‌నినోను సాకుగా చూపిస్తూ క్రాప్ హాలిడే ప్రకటించి, పరిపాలనను గాలికి వదిలేసి మంత్రులంతా ఢిల్లీలో మకాం వేశారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం ఆలోచిస్తోంది? ప్రజలకు ఏం కావాలి, రాష్ట్రంలో ఏం జరుగుతోందనే విషయాలపై ప్రభుత్వానికి కనీస అవగాహన ఉందా? రైతులకు పంటలు వేసుకోవద్దని క్రాప్ హాలిడే ప్రకటించారు. మరి రైతులకు ప్రత్యామ్నాయం ఏమిటి? వారి జీవనోపాధికి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? అని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావం పక్క రాష్ట్రాల్లోనూ ఉంది. కృష్ణా నది నుంచి సుమారు 350 టీఎంసీల నీరు దిగువకు వెళ్లినా, కనీసం 30 టీఎంసీల నీటిని కూడా నిల్వ చేసుకోలేకపోయారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 185 టీఎంసీల నుంచి 70 టీఎంసీలకు పడిపోయిందని అన్నారు. సుమారు 60 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు సిద్ధంగా ఉన్నా, మోటార్లను ఆన్ చేయడం లేదు. పక్క రాష్ట్రాలు నీటిని నిల్వ చేసుకుంటుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఆల్మట్టి డ్యామ్‌లో 132 టీఎంసీలు, నారాయణపూర్ డ్యామ్‌లో 33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని ఒడిసిపట్టుకుంటుంటే, మన ప్రభుత్వం మాత్రం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యాయి. ప్రజలు నీటి కోసం ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో వైద్యం అందక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హెల్త్ కార్డులు పనిచేయక వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు తమ కళ్ల ముందే పంటలు ఎండిపోతుండటాన్ని చూసి ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలి. రెండో పంట సాగు చేయవద్దని చెప్పిన ప్రభుత్వం, పంట వేయలేకపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలి. రైతులపై ఆధారపడిన వ్యవసాయ కూలీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. రేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆరోగ్య భద్రత కల్పించాలి. హోంగార్డులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణలో ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీని తలపిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడంతో నిరుద్యోగులు ఉద్యమిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఆసుపత్రుల్లో తక్షణమే వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యం అందక ఒక్కరు ప్రాణాలు కోల్పోయినా, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. పప్పు, ఉప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సామాన్యులు వాటిని కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన దుస్థితి వచ్చేలా ఉంది. ప్రభుత్వానికి ముందుచూపు లేదు. ఏదో ఒక సాకుతో కాలం వెళ్లదీస్తున్నారు. మంత్రులకు భూములు, పైరవీలపై ఉన్న శ్రద్ధ పరిపాలనపై లేదు. ప్రతి శాఖ మంత్రి తన శాఖపై పట్టు సాధించి, పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే ఇలాంటి పరిస్థితులు తలెత్తవు. ఆర్థిక ప్రయోజనాల కోసం భూములను నిషేధిత జాబితాలో చేర్చడం, వివిధ దందాల్లో మునిగిపోవడం, చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనపై పట్టు కోల్పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ శాఖ మంత్రి విద్యుత్ సరఫరాపై, వ్యవసాయ శాఖ మంత్రి సాగునీరు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు సంచులు తదితర రైతులకు అవసరమైన వనరులపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలి. క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదు. పంటలు సాగు చేసుకోలేని రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక సహాయం, నష్టపరిహారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

# తాళం వేసిన లెదర్ పార్క్.. 400 కుటుంబాల ఆశలు ఆవిరి!

**కోట్ల రూపాయలతో నిర్మించిన పార్క్ నిరుపయోగం**

**తుప్పు పడుతున్న యంత్రాలు.. ఉపాధి లేక వలసబాట పట్టిన చర్మకార యువత**

**లెదర్ పార్క్‌ను పరిశీలించిన విజోస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లెల సుజాత**



అచ్చంపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్): ఒకప్పుడు చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని భావించిన లెదర్ పార్క్ నేడు నిరుపయోగంగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన చెప్పుల తయారీ కేంద్రానికి తాళం పడటంతో సుమారు 400 కుటుంబాల ఆశలు ఆవిరయ్యాయి. ఆధునిక యంత్రాలు తుప్పు పడుతుండగా, శిక్షణ పొందిన యువకులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ పరిధిలోని బల్మూర్ మండలం జినుకుంట స్టేజీ వద్ద హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన లెదర్ పార్క్ దుస్థితి ఇది.

**చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యం ఎక్కడ?**

అచ్చంపేట నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అనేక కుటుంబాలు తరతరాలుగా చెప్పులు కుట్టడం, తోలు వస్తువులు తయారు చేయడం వంటి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ సంప్రదాయ వృత్తిని ఆధునికీకరించి, చర్మకారులకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు శాశ్వత ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం కోట్ల రూపాయలు వెచ్చించి భవనాలు, షెడ్లు, యంత్రాలు, ఇతర సదుపాయాలు కల్పించింది. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎల్‌ఐడీసీఏపీ) ఆధ్వర్యంలో సుమారు 400 మంది చర్మకార యువకులకు చెప్పుల తయారీ, డిజైనింగ్, కటింగ్, ఫినిషింగ్ వంటి అంశాల్లో నెలల తరబడి శిక్షణ పొందారు. ఆధునిక యంత్రాలతో నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసి మార్కెట్లో విక్రయించుకోవచ్చని, తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని వారు ఆశించారు. కానీ వారి ఆశలు ఎంతోకాలం నిలవలేదు. శిక్షణ పూర్తయిన తర్వాత పార్క్ నిర్వహణ, మార్కెటింగ్ సదుపాయాలు, ముడిసరుకు సరఫరా వంటి అంశాలపై తగిన శ్రద్ధ లేకపోవడంతో కార్యకలాపాలు క్రమంగా నిలిచిపోయాయని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం పార్క్ మూతపడటంతో అక్కడి యంత్రాలు నిరుపయోగంగా మారి, భవనాలు సైతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

**శిక్షణ పొందినా ఉపాధి దక్కలేదు.. వలసబాట పట్టిన యువత**

లెదర్ పార్క్ ద్వారా ఉపాధి పొందుతామని ఆశించిన యువకులకు చివరకు నిరాశే మిగిలింది. నెలల తరబడి శిక్షణ తీసుకున్నప్పటికీ, దానికి తగిన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రాలేదు. దీంతో పలువురు యువకులు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనోపాధి వెతుక్కుంటున్నారు. మరికొందరు తమ పూర్వీకుల నుంచి వస్తున్న పాత పద్ధతిలోనే రోడ్ల పక్కన చెప్పులు కుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి శిక్షణ ఇచ్చినా, ఆ శిక్షణను ఉపాధిగా మార్చే వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందని స్థానిక చర్మకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌ను తిరిగి ప్రారంభించి, తమకు ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.

**లెదర్ పార్క్‌ను పరిశీలించిన మల్లెల సుజాత**

మూతపడిన లెదర్ పార్క్‌ను మంగళవారం విజోస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, సామాజికవేత్త మల్లెల సుజాత స్వయంగా సందర్శించి పరిశీలించారు. పార్క్‌లోని షెడ్లు, యంత్రాలు, గోదాములను పరిశీలించడంతో పాటు స్థానిక చర్మకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పార్క్ ఏర్పాటుకు చేసిన ఖర్చు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అచ్చంపేట వంటి వెనుకబడిన ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో చర్మకారుల ఉపాధి కోసం లెదర్ పార్క్ ఏర్పాటు చేయడం గొప్ప ఆలోచన అని పేర్కొన్నారు. హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యం అందుబాటులో ఉందని, విద్యుత్, నీరు, షెడ్లు వసతులు కూడా ఉన్నాయని తెలిపారు.

**ప్రభుత్వం చొరవ తీసుకుంటే పార్క్‌కు పునర్వైభవం**

లెదర్ పార్క్‌ను తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మల్లెల సుజాత ప్రభుత్వాన్ని కోరారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుంటూ, యంత్రాలను మరమ్మతు చేసి, అవసరమైన ముడిసరుకును సరఫరా చేస్తే ఉత్పత్తి కార్యకలాపాలను పునఃప్రారంభించే అవకాశాలను పరిశీలించవచ్చని అన్నారు. పార్క్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, శిక్షణ పొందిన యువతకు తిరిగి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే ఈ కేంద్రం చర్మకార కుటుంబాలకు ఉపాధి కల్పించే ముఖ్యమైన వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డారు. కేవలం చెప్పుల తయారీకే పరిమితం కాకుండా, మార్కెట్లో డిమాండ్ ఉన్న అనేక రకాల తోలు ఉత్పత్తులను తయారు చేసే కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

**చెప్పుల నుంచి బ్యాగుల వరకు.. 30 రకాల ఉత్పత్తులకు అవకాశం**

లెదర్ పార్క్‌ను సక్రమంగా వినియోగంలోకి తీసుకొస్తే చెప్పులతో పాటు లెదర్ బెల్టులు, పర్సులు, హ్యాండ్‌బ్యాగులు, కీ చైన్లు, వాహనాల సీటు కవర్లు, జాకెట్లు, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించే గ్లౌజులు వంటి 30కి పైగా రకాల ఉత్పత్తులను తయారు చేసే అవకాశాలు ఉన్నాయని మల్లెల సుజాత వివరించారు. ఈ ఉత్పత్తులను స్థానిక మార్కెట్లతో పాటు ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయించేందుకు అవసరమైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. సరైన శిక్షణ, ముడిసరుకు, యంత్రాల నిర్వహణ, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే చర్మకార కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబం నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించగలదన్నది తన అంచనా అని తెలిపారు.

**ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా**

లెదర్ పార్క్ పునఃప్రారంభ అంశాన్ని ఎల్ఐడీసీఏపీ చైర్మన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని మల్లెల సుజాత తెలిపారు. బుధవారం అచ్చంపేట పర్యటనకు రానున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కూడా వినతిపత్రం అందించి, పార్క్ పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని చర్మకారులు, మాదిగ సంఘాల నాయకులు, యువకులు ఐక్యంగా ముందుకొచ్చి పార్క్‌ను తిరిగి ప్రారంభించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక భవనం సమస్య కాదని, వందలాది కుటుంబాల ఉపాధి, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి: స్థానిక చర్మకారులు సుమారు 400 మందికి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాల్సిన సమయంలో పార్క్ మూతపడటంతో తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని స్థానిక చర్మకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన కేంద్రం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి లెదర్ పార్క్‌ను పునఃప్రారంభించాలని కోరుతున్నారు. పార్క్‌లోని యంత్రాలు, భవనాలు మరింత పాడైపోకముందే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని, శిక్షణ పొందిన యువతకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లెదర్ పార్క్ పునరుద్ధరణతో తమ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించడమే కాకుండా, అచ్చంపేట ప్రాంతంలో చర్మ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక చర్మకారులు, విజోస్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.